క్లుప్తంగా

బీజేపీతోనే దేశం పురోగతి



ఇంటింటి ప్రచారం చేస్తున్న కిరణ్

పరిగి: బీజేపీ ప్రభుత్వంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మారుతి కిరణ్ భూనేటి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రం 1వ వార్డు మల్లెమోనిగూడలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందో దేశ ప్రజలందరికీ తెలుసునని, గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయంటే అది కేంద్ర ప్రభుత్వ నిధులతోనేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంచెందర్, బాలకృష్ణారెడ్డి, నర్సింహులు, రమేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాండూరు టౌన్: నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తాండూరు విద్యుత్ డీఈఈ భానుప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా తాండూరు పట్టణం, తాండూరు, యాలాల, పెద్దేముల్, బషీరాబాద్, బంట్వారం, కోటపల్లి మండలాల్లో ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌కు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం..

కష్టాలు దూరం చేసుకుందాం



ఇంటింటి ప్రచారం చేస్తున్న నేతలు

కుల్కచర్ల: సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి టి.రామ్మోహన్ రెడ్డి తనయుడు రితిక్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి సాయి ముదిరాజ్ అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ అంటే పేదల పార్టీ అని, పార్టీని గెలిపించుకొని కష్టాలను దూరం చేసుకుందామని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. యాచారం సీఐ సైదయ్య తెలిపిన వివరాలు.. నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రానికి చెందిన భవానీ ప్రసాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా వనపల్లికి చెందిన ప్రసాద్(30)తో కలిసి బైక్‌పై మంగళవారం హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో తక్కళ్లపల్లి గేట్–మాల్ మధ్యన బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసాద్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. తీవ్ర గాయాలైన భవానీప్రసాద్‌ను 108లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అవినీతి రహిత పాలన రావాలంటే..

కుల్కచర్ల: అవినీతి రహిత పాలన రావాలంటే బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పార్టీ బీసీలకు పెద్దపీట వేసిందని, అందుకు బీజేపీకి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున కమలం గుర్తుకు ఓటేసి పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం

తుర్కయంజాల్: బాల్యవివాహాలను అరికట్టాలని 14వ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ సల్మా ఫాతిమా పిలుపునిచ్చారు. రాగన్నగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చిల్డ్రన్స్‌డే వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలల హక్కుల గురించి వివరించారు. అదేవిధంగా రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, శంకర్, శ్రీదేవి, రవి తదితరులు పాల్గొన్నారు.

హరితహననం..

కాలుష్యాన్ని పారదోలి, పచ్చని చెట్లతో తెలంగాణకు పచ్చలహారం తొడగాలన్న సంకల్పంతో హరితోత్సవానికి శ్రీకారం చుట్టింది రాష్ట్ర ప్రభుత్వం. అందులో భాగంగా అడవుల పెంపకం, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటిస్తోంది. అందుకు రూ.కోట్లు వెచ్చిస్తోంది. కానీ కొందరు అధికారుల నిర్లక్ష్యం వలన లక్ష్యం నీరుగారిపోతోంది.



మదనంతపూర్ నర్సరీలో ఎండి పోయిన మొక్కలను ఏరి వేస్తున్న కూలీలు



పెద్దేముల్-నాగులపల్లి రోడ్డు పక్కన ఎండిపోయిన మొక్కలు

- నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం
- మొక్కల పంపిణీలో అలసత్వం
- చచ్చిపోతున్న వైనం..
- రోడ్లపక్కన దర్శనమిస్తున్న సపోర్టు కర్రలు

పెద్దేముల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు వాడిపోతున్నాయి. పర్యవేక్షణ, సంరక్షణ కరవై మొక్కల స్థానంలో ఊతకర్రలే దర్శనమిస్తున్నాయి. దీంతో పర్యావరణ ప్రేమికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. పెద్దేముల్ మండల పరిధిలో 37 జీపీల్లో 37 వన నర్సరీలను సర్కారు ఏర్పాటు చేసింది. వాటి రక్షణకు యేటేటా అనేక నిధులు ఖర్చు చేస్తోంది. నర్సరీల్లో సాగు చేసిన మొక్కలను ఇంటింటికీ పంపిణీతో పాటు రోడ్లకు ఇరువైపులా, క్రీడా మైదానాల చుట్టూ, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలతో పాటు, మొక్కలు చనిపోయిన స్థానంలో కొత్తగా నాటవలసి ఉంది. కానీ పథకం సరిగా అమలుకాక.. నర్సరీల్లోనే మొక్కలు వాడిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ యేడు మండలంలో ప్రభుత్వం హరితహారం కింద లక్షా 66వేల 500 మొక్కలు నాటాలనే లక్ష్యం నిర్దేశించగా.. ఇప్పటి వరకు సుమారు లక్షా 9వేల 910 నాటినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది.

పెంపకం సరే..

ప్రభుత్వం ఒక నర్సరీలో సుమారు 5వేల మొక్కలకు తగ్గకుండా పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకుంది. కానీ పెంచిన వాటిల్లో 50 శాతం కూడ పంపకం జరగటం లేదని తెలుస్తోంది. సుమారు మూడేళ్లుగా నర్సరీల్లోనే అధిక మొక్కలు పాడైనా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్న అపవాదం ఉంది. కావున సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ.. నర్సరీల సంరక్షణ, మొక్కల పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ లక్ష్మప్పను వివరణ కోరగా.. నర్సరీల్లో మొక్కలు ఎండిపోయినా, రోడ్ల పక్కన నాటినవి చచ్చిపోయినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



చింతలపల్లిలో సాగు విధానంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

అధిక సాంద్రతతో అధిక దిగుబడి

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యమున

పూడూరు: అధిక సాంద్రత కలిగిన పంటలను సాగు చేసి, మంచి దిగుబడులు పొందాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యమున అన్నారు. పత్తి పరిశోధన కేంద్రం ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా మంగళవారం పూడూరు మండల పరిధి చింతలపల్లి, కంకల్, మేడిపల్లి, మంచన్‌పల్లి తదితర గ్రామాల్లో రైతులు వేసిన అధిక సాంద్రత గల పత్తి పంటను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో కలిసి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అధిక సాంద్రత పత్తిలో కలుపుతీయడంతో పాటు, ఎరువులు తదితర యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ విధానం సాగు అవశ్యకతను, దిగుబడిని పెంచే విధానాన్ని రైతులకు తెలిపారు. పత్తిలో అంతర పంటల సాగుతో పాటు, లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసి చీడపీడలను నివారించవచ్చని సూచించారు. శాస్త్రవేత్తలు లక్ష్మణ్, వెంకటేశ్, గుల్జార్‌భాను, మధు, శ్రీకాంత్, వ్యవసాయ అధికారులు ఉన్నారు.

జేసీబీ ఆపరేటర్ల వేతనాలు పెంచాలి

కొడంగల్: వేతనాలు పెంచాలని జేసీబీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చాలీచాలనీ వేతనాలతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ప్రస్తుత వేతనం రూ.15వేలు చెల్లిస్తున్నారని, దానిని రూ.20వేలకు పెంచాలన్నారు. అంతే కాకుండా పని వేళలను తగ్గించాలని, ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు నిర్ణయించాలన్నారు. అదనంగా పనిచేస్తే అదనపు వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. దినసరి బత్తాను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్లు కృష్ణయ్య, అనిల్, రాజు, విష్ణు, నితిన్, అంజు, ప్రకాశ్, విశాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలం



అన్నసాగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మనోహర్‌రెడ్డి

- తాండూరులో పెరిగిన బీఆర్ఎస్ నేతల అరాచకాలు
- కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమానికి భరోసా
- ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి

యాలాల: బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, తెలంగాణ ఏర్పడి పదేళ్లు కావస్తున్నా.. ఉద్యోగాల కల్పనలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన కోకట్, రాఘవపూర్, నాగసముందర్, అన్నసాగర్, బాణాపూర్, అడాల్‌పూర్, బాగాయిపల్లి, పగిడియాల, రాస్నం, గంగాసాగర్, ముద్దాయిపేట, అచ్యుతాపూర్, తొప్పెర్లగడ్డతండా, సంగాయగుట్ట తండా తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బుయ్యని మాట్లాడారు.

'హస్తం' హయాంలోనే జంబో డీఎస్సీ

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమానికి పూర్తి భరోసా లభిస్తుందన్నారు. తమ హయాంలోనే జంబో డీఎస్సీ నిర్వహించామని, సీఎం కేసీఆర్ మోసపూరిత మాటలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిల్లో లేరన్నారు. తాండూరులో అధికార పార్టీ నాయకుల అరాచకాలు పెరిగాయని విమర్శించారు. మూడు దశాబ్దాలుగా మీ మధ్యనే ఉంటూ.. వ్యాపారం చేసుకుంటూనే సేవచేసినట్లు పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని, చేతి గుర్తుకు ఓటు వేసి, కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రాఘవపూర్, నాగసముందర్, పగిడియాల గ్రామాల నుంచి బీజేపీకి చెందిన పలువురు నాయకులు, యువకులు మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, బీసీసెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, పగిడియాల ఉప సర్పంచ్ నర్సింహులు గౌడ్, నేతలు హన్మంతు, మహిపాల్, మెట్టు వెంకట్, సత్యనారాయణరెడ్డి, రఘురాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పిల్లలకు ఇవ్వాల్సిన ఆస్తి చదువే



కుల్కచర్ల: కేజీబీవీలో విద్యార్థినులతో అధ్యాపకులు

బాలల దినోత్సవంలో ఉపాధ్యాయులు

కుల్కచర్ల: నేటి బాలలే రేపటి పౌరులు అని, భవిష్యత్ భారతావనికి పునాదులని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేక అధికారి దేవి అన్నారు. మంగళవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషిస్తూ.. తోటి వారికి పాఠ్యాంశాలను బోధించారు. సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి విద్య ఒక్కటేనని చెప్పారు.

ఆటల పోటీలు

కొడంగల్: దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయులు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సమానంగా చూడాలి..

పెద్దేముల్: బాలురు, బాలికలు అని తేడా చూపకుండా పిల్లలను సమానంగా చదివించాలని మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా రుద్రారం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని, బడిఈడు పిల్లలందరూ బడికి వెళ్లేలా వారి తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్ బాలమణి ఉన్నారు.



పెద్దేముల్: రుద్రారంలో..



కొడంగల్: విద్యార్థులతో ఉపాధ్యాయులు

బీఆర్ఎస్‌ను బొంద పెట్టడం ఖాయం

షాబాద్: ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొందపెట్టడం ఖాయమని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, ఎన్ రాంరెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్ సతీమణి జ్యోతి అన్నారు. మంగళవారం నాగర్‌కుంట, మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ, చర్లగూడ, ఆస్పల్లిగూడ గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి పాలన నడుస్తోందని ఆరోపించారు. తెలంగాణ సిద్ధించి పదేళ్లు కావస్తున్నా అభివృద్ధిలో ఇంకా వెనక బడి ఉందని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందజేస్తామని, మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతో పాటు వారికి ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కావున రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

మోసపోతే గోసపడతాం



ధారూరు: మాట్లాడుతున్న ప్రసాద్ కుమార్

- బీఆర్ఎస్ మాయమాటలు నమ్మకండి
- ప్రజాధనం కొల్లగొడుతున్న తండ్రీ కొడుకు
- కాంగ్రెస్ వస్తే అందరికీ మేలు
- రెండు లక్షల కొలువులతో పాటు, ఆరు గ్యారంటీలు అమలు
- ఇంటింటి ప్రచారంలో ప్రసాద్ కుమార్

ధారూర్: బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ మాయమాటలను రెండుసార్లు నమ్మి మోసపోయారని, ఈ సారి నమ్మి ఓటేస్తే గోసపడతామని మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాద్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండల పరిధి దోర్నాల్, అంపల్లి, గోరుదుట్ల, పీసీఎం తండా, కుమ్మరపల్లి, నాగారం, రాజాపూర్, మోమిన్ కుర్దు, మోమిన్ కలాన్, అంతారంలో విస్తృతంగా పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చినప్పుడు కేటీఆర్ పుట్టలేదని, సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చినందుకే తండ్రీ కొడుకులు రాష్ట్రాన్ని ఏలుతూ.. ప్రజాధనం కొల్లగొడుతున్నారని ఆరోపించారు.

హామీలను విస్మరించిన సీఎం

పదేళ్ల తెలంగాణను తాగుబోతుల, దోపిడీ మయం చేశారని ప్రసాద్‌కుమార్ విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూమ్, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. ఆ తరువాత వాటన్నింటినీ విస్మరించారని, ఆయన మోసాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. ఉచిత కరెంటు, రుణమాఫీ పథకాలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలోనే అమలు అయ్యాయని గుర్తుచేశారు. చదువుకున్న యువకులకు ఉద్యోగాలు రాక, కూలీ పనులు చేసున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల కొలువులతో పాటు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతుబంధు, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితర వాటిని అమలు చేస్తామని హామీ చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, నాయకులు హనుమంత్ రెడ్డి, మాన్ సింగ్, హరిచంద్, నారాయణరెడ్, బుజ్జయ్య గౌడ్, నాగార్జున రెడ్డి, ఇనాయకుల్లా ఖాన్, బాబాఖాన్, అంజయ్య, అశోక్, మల్లేశం, వెంకటయ్య, అనంతయ్య, షరీఫ్ పాల్గొన్నారు.



మర్పల్లి: తిమ్మాపూర్ నాయకుల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం దౌల్తాబాద్ మండలం చంద్రకల్ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

–దౌల్తాబాద్

వేంకటేశ్వర స్వామి సన్నిధిలో దీపోత్సవం



ఆకాశ దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: కనకమామిడి సమీపంలోని వేంకటేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక మాస ఆకాశదీపోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా సోమవారం రాత్రి నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు ప్రతీరోజు సాయంత్రం 6.45 నిమిషాలకు ఆకాశదీపోత్సవం నిర్వహించనున్నామన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ లక్ష్మికాంత్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వద్దనుకున్న వారే ఆదరించాలి..



ఇంటింటి ప్రచారంలో అనన్య

మోమిన్‌పేట: 'వద్దనుకొని రెండుసార్లు ఓడించిన మీరే.. మా నాన్నను గెలిపించాలి' అని కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ కూమార్తె అనన్య చైతన్ కోరారు. మండల కేంద్రం మోమిన్‌పేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో పార్టీ మీ ముందుకు వచ్చిందని, చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు శుభాష్ గౌడ్, ఉప సర్పంచ్ నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, బాబా, అరుణ్, ప్రభాకర్, చేన్న, లక్ష్మణ్, అనంద్ తదితరులు ఉన్నారు.

సోనియాకు కృతజ్ఞత చెప్పాలి..

వికారాబాద్ అర్బన్: కేసీఆర్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని, పేదల పక్షాన నిలబడే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని బ్లాక్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలెద్ కోరారు. పట్టణంలోని ఆలంపల్లి, కొత్తగడిలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఇందులో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల కల సాకారం చేసిన సోనియా గాంధీకి అధికారం ఇచ్చి, కృతజ్ఞత చెప్పుకోవాలని కోరారు.

ధరణికి బదులు కొత్త చట్టం

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ తీసుకు వచ్చిన ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి, కొత్త రెవెన్యూ చట్టం తీసుకువస్తామని ఆ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు సుభాష్ యాదవ్ అన్నారు. మర్పల్లి మండలం తిమ్మాపూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో పంచలింగాల, మర్పల్లి మాజీ సర్పంచ్‌లు సురేష్, పాండు, పార్టీ మండల నాయకులు శివ, రఘు గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రాస్నం శివారులో పులి కలకలం

రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన పోలీసులు

యాలాల: మండల పరిధి రాస్నం గ్రామ శివారులో మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో పులి సంచారం కలకలం రేపింది. యాలాల ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పగిడియాల–రాస్నం మార్గంలోని గుట్టపై గల మిషన్ భగీరథ ట్యాంకు సమీపంలో వాటర్‌మెన్‌లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పెద్ద గాండ్రింపు శబ్దంతో పులి లాంటి ఆకారం రోడ్డు దాటుతున్నట్లు కార్మికులు గమనించారు. అదే సమయంలో రాస్నం వైపు ఓ బైక్‌పై వెళ్తున్న ప్రయాణికుడు పులి లాంటి జంతువును చూసి ఆందోళనకు గురై అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన ఆ వ్యక్తిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించిన ప్రదేశంలో రిజర్వ్ ఫారెస్టు పరిధిలో ఉండటంతో, పులి సంచరిస్తుండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. బుధవారం ఉదయం అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తామని ఎస్ఐ తెలిపారు. కాగా పగిడియాల, అన్నసాగర్, బాణాపూర్, రాస్నం శివారు ప్రాంతాల్లో పొలాలు ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

కమ్మేస్తున్న మంచు

వికారాబాద్ అర్బన్: అసలే చలికాలం.. ఆపై పొగమంచు దట్టంగా ఊరూవాడను కప్పేయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బయటకు వెళ్లాలంటే వణికి పోతున్నారు. ఉదయం 8 గంటల వరకు మంచుతెర తొలగకపోవడంతో ముఖ్యంగా వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక.. రోడ్డు పక్కనే తమ వాహనాలను నిలిపేస్తున్నారు. మంచు తగ్గాక ముందుకు సాగుతున్నారు.



పంటపొలాలను కప్పేసిన పొగమంచు